క్లుప్తంగా

ఆలయాలలో శ్రావణ మాస పూజలు



ప్రత్యేకాలంకారంలో వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

సదుం: శ్రావణమాసం చివరి మంగళవారం పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహించి, బ్రహ్మకమలాలతో అలంకరించారు. రెడ్డివారిపల్లె ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

అనిసెట్టి రజిత మరణం సాహితీ లోకానికి తీరని లోటు



అనిసెట్టి రజిత(ఫైల్)

పలమనేరు: ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు, ప్రముఖ రచయితి అనిసెట్టి రజిత మరణం సాహితీ లోకానికి తీరని లోటని పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్ష్యులు మాధవ్ మంగళవారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రజిత మృతికి మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక రచయితలు బాలాజి, కుమారస్వామి, తులసీ నాథం యుడు, శ్రీరామచంద్రమూర్తి, హేమ కుమార్, గండికోట వారిజ, రెడ్డెమ్మ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

పుంగనూరు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం డిపో ఎదుట ధర్నా చేశారు. యూనియన్ నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ, తక్షణమే పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం



మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

పులిచెర్ల(కల్లూరు): అందరి సహకారంతో మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఎంపీపీ మాట్లాడారు. మండలంలో అన్ని శాఖల్లో ఇక్కడ పనిచేసిన ఉద్యోగులు బదిలీపై వెళ్లారని, వారి స్థానంలోకి కొత్తవారు వచ్చారన్నారు. అందరి సహకారం, సమన్వయంతో మండలంలో అభివృద్ధి పనులు చేయాలన్నారు. అన్ని పంచాయతీలలోని ప్రజాప్రతినిధుల సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడం వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో దీనిపై ప్రజలను అప్రమత్తం చేయాలని వైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర బాబు, వైస్ ఎంపీపీ ఈశ్వరి, ఎంపీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

పంటలపై ఆగని ఏనుగుల దాడి



ఏనుగులు తొక్కేసిన వేరుశనగ పంట

పులిచెర్ల(కల్లూరు): మండలంలో ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. రైతులకు కంటికి కునుకు లేకుండా చేస్తూనే ఉన్నాయి. మంగళవారం తెల్ల వారుజామున మండలంలోని గండోలపల్లె, బాలిరెడ్డిగారిపల్లె, దేశిరెడ్డిగారిపల్లె సమీప గ్రామాల్లో పంటలపై ఏనుగుల గుంపు పడి నష్టం కలిగించింది. పగటి పూట సమీపంలోని చింతల వంకలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు రాత్రి సమయంలో పంటలపై పడుతున్నాయి. మామిడి కొమ్మలను విరిచేశాయి. వరినారు తొక్కేశాయి. కొబ్బరి చెట్లను పెరిగివేయడంతోపాటు వేరుశనగ పంటను నాశనం చేశాయి. వీటి ధాటికి రైతులు పొలాల వద్దకు వెళ్లడానికి హడలిపోతున్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

పెద్దపంజాణి: మండలంలోని రాజులూరు సమీపంలోని కమ్మవాని చెరువు వద్ద కోడి పందేలు ఆడుతున్న ఐదుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ ధనంజయ రెడ్డి తెలిపారు. అందిన రహస్య సమాచార మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలసి దాడి చేశారు. వారి నుంచి రూ 6,200, రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో..?

ఏళ్ల తరబడి రాయలపేట ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. రోజు రోజుకూ గ్రామంలో వాహనాల రాకపోకల సంఖ్య పెరుగుతోంది. అయితే దీనికనుగుణంగా రోడ్డు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. రోడ్డు విస్తరణ ప్రతిపాదనలకే పరిమితమవుతుండగా పెరుగుతున్న ట్రాఫిక్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయినా అధికారులు మాత్రం దీనిపై దృష్టి సారించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

- రాయలపేటలో తరచూ స్తంభిస్తున్న ట్రాఫిక్
- విస్తరణకు నోచుకోని మెయిన్ రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



గ్రామంలోని నాలుగురోడ్ల కూడలి వద్ద స్తంభించిన ట్రాఫిక్

పెద్దపంజాణి: దాదాపు మూడు దశాబ్దాల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా రాయలపేటలో రోడ్డు వేశారు. ప్రస్తుతం పెరిగిన జనాభా, వాహనాలకు తగ్గట్టు రోడ్డును విస్తరించకపోవడం, గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వాహనాల రాకపోకలు అధికం కావడంతో సమస్య మరింత తీవ్రరూపం దాల్చింది. పలమనేరు నుంచి చౌడేపల్లె పరిసర ప్రాంతాలకు రాయలపేట మీదుగా అధిక సంఖ్యలో నిత్యం వాహనాలు ప్రయాణిస్తుంటాయి. చిత్తూరు, తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల ప్రజలు ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దర్శనానికి రాయలపేట మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. చౌడేపల్లె, సోమల, సదుం మండలాల నుంచి పలమనేరులోని ప్రైవేటు కళాశాల బస్సులు కూడా ఇదే మార్గం మీదుగా వెళ్తుంటాయి. దీంతో పాటు చౌడేపల్లె, సోమల, సదుం మండలాల రైతులు తమ వ్యవసాయోత్పత్తులను పలమనేరు వ్యవసాయ మార్కెట్‌కు తరలిస్తుంటారు. మరోవైపు గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలలో సరుకుల కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు తమ వాహనాలను రహదారిపై పార్కింగ్ చేస్తుంటారు. కళాశాల బస్సులు, కూరగాయల ఆటోలు, ఆర్టీసీ బస్సులు, స్థానికంగా ఉన్న ఆటోలు రోడ్డుపైనే ఆపి ప్రయాణికులు ఎక్కించుకోవడం, దించడం చేస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్య తరచూ ఉత్పన్నమవుతూ రాకపోకలు స్తంభిస్తున్నాయి. దీనికి తోడు బజారు వీధిలోని నాలుగు రోడ్ల కూడలి, రాములవారి వీధిలోని ఇండియన్ బ్యాంకు దగ్గర పరిస్థితి మరీ ఘోరంగా ఉంటుంది. బ్యాంకుకు వచ్చేవారు తమ వాహనాలను రోడ్లపై అడ్డదిడ్డంగా నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అసలే ఇరుకైన నాలుగురోడ్ల కూడలిలో భారీ వాహనాల రాకపోకల వల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికే ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొంటున్న వాహనచోదకులకు వారపు సంత రూపంలో మరిన్ని సమస్యలు తప్పడం లేదు. ప్రతి గురువారం రోడ్డుపైనే సంత జరుగుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

లోడింగ్, అన్ లోడింగ్‌తో సమస్య

రాయలపేటలో పట్టపగలు రోజంతా ఎక్కడో ఓ చోట వాహనాలను ఆపి సరుకుల లోడింగ్, అన్ లోడింగ్ చేస్తుండటం వల్ల కూడా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అప్పుడప్పుడు దీనిపై గొడవలు కూడా చోటుచేసుకుంటున్నాయి. రోజంతా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా న్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. గ్రామంలో సరుకుల లోడింగ్, అన్ లోడింగ్‌కు ఉదయం 8 గంటల్లోపు, రాత్రి 8 తర్వాత మాత్రమే అనుమతించాలని, నాలుగు రోడ్ల కూడలిలో పోలీసులు విధులు నిర్వహిస్తే ట్రాఫిక్ సమస్యకు కొంతమేర చెక్ పెట్టవచ్చని గ్రామస్తులు చెబుతున్నారు.

రోడ్డు విస్తరణకు తొలగని అడ్డంకులు

దాదాపు ఏడేళ్ల క్రితం మండలంలోని కోగిలేరు చెక్‌పోస్టు నుంచి రాయలపేట మీదుగా చౌడేపల్లె మండల సరిహద్దులోని వీరప్పల్లె వరకు ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేశారు. గ్రామంలో రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ వేశారు. అయితే దుకాణదారులు, ఇంటి యజమానులకు, అధికారులకు విస్తరణ విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రోడ్డు విస్తరణ ఎటూ తేలకుండా సందిగ్ధంలో పడింది. దీంతో రోడ్డు విస్తరణ జరిగి ట్రాఫిక్ సమస్య తీరుతుందని ఆశగా ఎదురుచూస్తున్న వాహనదారుల ఆశలు అడియాశలవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణకు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



ఆనందప్ప (ఫైల్)

బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత ఆనందప్ప అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, మండల వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షులు మహేష్ బాబు, మండల కన్వీనర్ కార్తిక్, సర్పంచ్ జ్యోతమ్మ, ఎంపీటీసీ రవీంద్రమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు బాలాజి, ప్రవీణ్, కేశవులు, శ్రీనివాసులు, మునేగౌడు తదితరులు నివాళులు అర్పించారు. పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గణేష్

రొంపిచెర్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. ఈ నెల 3న రాత్రి మండలంలోని పెద్దగొట్టిగల్లు సమీపంలో జాతీయ రహదారిపై బోడిపాటి వారిపల్లెకు చెందిన గణేష్ (28) ద్విచక్ర వాహనంలో పీలేరు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా పెద్దగొట్టిగల్లు సమీపంలోని రెడ్డిచెరువు వద్ద అదుపు తప్పి పడ్డాడు. ఈ ప్రమాదంలో గణేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారై ఉన్నారు. ప్రస్తుతం మృతుని భార్య మళ్లీ గర్భంతో ఉంది. కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడిందని బంధువులు భోరువ విలపించారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

చెరువులో పడి బాలుడు మృతి



భార్గవ్ (ఫైల్)

వి.కోట: చెరువును చూడడానికి వెళ్లి కాలుజారి పడి బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని యాలకల్లులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం .. యాలకల్లుకు చెందిన నాగరాజు, కల్పన దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పశుపోషణ, ఎలక్ట్రీషియన్ పనులతో నాగరాజు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమారుడు భార్గవ్ (11) వి.కోటలో 6వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం స్కూల్ నుంచి వ్యాన్‌లో స్వగ్రామానికి చేరుకున్నాడు. తన తల్లి గ్రామ సమీపంలోని చెరువు వద్ద ఆవులను మేపుతున్నట్లు తెలుసుకున్న భార్గవ్ అక్కడికి వెళ్లాడు. అదుపు తప్పి చెరువు నీటిలో పడిపోయాడు. గమనించిన అతడి తల్లి చెరువులోకి దూకి బిడ్డను శ్రమలకోర్చి గట్టుకు చేర్చింది. అయితే అప్పటికే అతడు మృతి చెందడంతో గుండెలవిసేలా రోదించింది. ఈ ఘటన స్థానికులకు కంటతడి పెట్టించింది.

ఆక్రమణ నుంచి ప్రభుత్వ భూమికి విముక్తి



ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ భూమిలో నాటిన మామిడి మొక్కలను తొలగిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

- నాటిన మామిడి మొక్కలు తొలగించిన రెవెన్యూ అధికారులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

చౌడేపల్లి: ప్రభుత్వ భూములను ఆక్రమించినా, ఎలాంటి అనుమతులు లేకుండా ప్రవేశించినా కఠిన చర్యలు తీసుకుటామని తహసీల్దార్ పార్వతి హెచ్చరించారు. మంగళవారం ఆమినిగుంట పంచాయతీ రామయ్యగట్లు సమీపంలోని సర్వే నంబర్ 922/ఏ లో కొందరు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, చదును చేసి మామిడి మొక్కలు నాటారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ స్పందించారు. ఆమె ఆదేశాలతో సిబ్బంది ఆక్రమిత స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో నాటిన మామిడి మొక్కలను తొలగించారు. ఇది ప్రభుత్వ స్థలమని హెచ్చరిస్తూ బోర్డు ఏర్పాటు చేశారు. ఇదలా ఉంచితే, ఆక్రమణదారులు చదును చేసి మొక్కలు నాటేంతవరకు అధికారులు నిద్రావస్థలో ఉన్నారా? అనే విమర్శలొస్తున్నాయి. కార్యక్రమంలో వీఆర్వోలు మంజుల, విజయ్‌కుమార్‌రెడ్డి, యశోద, వీఆర్ఏలు రాజన్న, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ర్యాలీ



ఏఐఎస్ఎఫ్ జెండాను ఎగురవేస్తున్న మున్నా తదితరులు

పుంగనూరు: రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ మంగళవారం ర్యాలీ నిర్వహించింది. రాష్ట్ర సభ్యుడు మున్నా ఆధ్వర్యంలో విద్యార్థులు ఏఐఎస్ఎఫ్ జెండాను గోకుల్ సర్కిల్‌లో ఎగురవేశారు. మున్నా మాట్లాడుతూ, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. హాస్టళ్లలో కాస్మొటిక్ చార్జీలు పెంచాలని , జీఓ నంబర్ 77, 107, 108ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు సాయితేజ, వంశీ, బాలాజి, గుణశేఖర్, ధనుంజయ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కుక్క తెచ్చిన తంటా..!

–ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడిన గుర్రప్ప, బాషా

చౌడేపల్లి: కుక్క హఠాత్తుగా అడ్డుగా రావడంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి తీవ్రగాయాల పాలైన సంఘటన మంగళవారం చౌడేపల్లె–బోయకొండ మార్గంలోని మల్లువారిపల్లె బస్టాప్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. పెద్దపంజాణి మండలం వీరప్పల్లెకు చెందిన గుర్రప్ప, కోటూరుకు చెందిన బాషా బోయకొండ నుంచి టీవీఎస్ ఎక్సెల్‌లో చౌడేపల్లె వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో కుక్క మూలాన ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన వీరిని స్థానికులు చౌడేపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హామీలు నెరవేర్చకుండా 'బాబు' మోసం



ఏటవాకిలిలో బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

పుంగనూరు: అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగిస్తోందని వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం మండలంలోని ఏటవాకిలిలో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి , ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, జిల్లా యూత్ వింగ్ కార్యదర్శి కొత్తపల్లె చెంగారెడ్డి, పీకేఎం ఉడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్యూ ఆర్ కోడ్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు ఎంతగా ప్రజలను మోసం చేశారో అన్ని గ్రామాలకు వెళ్లి చాటిచెబుతామని, ఈ కార్యక్రమాన్ని 14వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. తద్వారా ప్రజలను చైతన్యవంతుల్ని చేసి ప్రభుత్వాన్ని నిలదీసేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు జయరామిరెడ్డి, రాజారెడ్డి, రామమోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, బాబునాయక్, సుబ్బన్న, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

నులిమేద్దాం



పుంగనూరు: అడవినాథునికుంటలో..

పుంగనూరు: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మండలంలోని అడవినాథునికుంటలో మెడిలాఫీసర్ పవన్‌కుమార్ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, ఎంపీహెచ్ఈఓలు మురళిబాబు, హరిప్రసాద్‌రెడ్డి, హెచ్ఎం శ్రీరాములురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదుం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు చరణ్ తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాసుల రెడ్డి మాత్రలు వేశారు..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లె హైస్కూల్లో విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మాత్రలను పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర మెడికలాఫీసర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. డాక్టర్ అపర్ణ, పబ్లిక్ హెల్త్ నర్స్ శ్రీదేవి ,ఆరోగ్య విస్తరణాధికారి చంద్రయ్య, సూపర్‌వైజర్ ప్రమీల, పురుషోత్తం పాల్గొన్నారు.

రొంపిచెర్లలో 3913 మందికి..

రొంపిచెర్ల: మండలంలో 38 పాఠశాలల్లో 3913 మంది నులి పురుగుల మాత్రలు వేసుకున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో చేతుల పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ అమ్మాజీ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీ గీతాశ్రీ, ఆరోగ్య కార్యకర్తలు సితారబీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గుడుపల్లె: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణమనాయుడు, పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు అమరేంద్రబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలో 1నుంచి 19 ఏళ్లలోపు ఉన్న 13వేలమందికి మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు పాతపేట మెడికలాఫీసర్ సురేఖ తెలిపారు. బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు మాత్రలు మింగించి ఆమె మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, జైశంకర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం: 9 సచివాలయాల పరిధిలోని మొత్తం 13,325 మంది పిల్లలకు మాత్రలను పంపిణీ చేసినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి లహరి తెలిపారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ పరిధిలోని స్కూళ్లలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు విజయ్ చంద్ర, అరుణ్‌కుమార్ మాట్లాడారు. ఎంపీడీఓ రాజేంద్ర బాలాజి, హెల్త్ ఎడ్యుకేటర్లు కాంతమ్మ, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరులో..

టీచర్లను మోసం చేసిన కూటమి ప్రభుత్వం



కరుణాకరరెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ టీచర్ల సంఘ నేతలు

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ సమస్యలు తీరుతాయని భావించిన టీచర్లను ఆ ప్రభుత్వం నిండా మోసం చేసిందని, పలు సమస్యలు ఇప్పటికీ పరిష్కరించని పాపానపోలేదని వైఎస్సార్‌సీపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘ జిల్లా నాయకులు సోమచంద్రారెడ్డి విమర్శించారు. ఇటీవల పార్టీ అనుబంధ విభాగాల జిల్లా కార్యవర్గాలను కేంద్రపార్టీ కార్యాలయం ప్రకటించింది. ఈ నేపథ్యంలో సంఘ నేతలు మంగళవారం ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కరుణాకరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షులు రూబెన్ పాల్గొన్నారు.

అధిక ధరలకు యూరియా అమ్మకాలు



చౌడేపల్లెలో పుడమి ఫర్టిలైజర్స్‌లో వేలిముద్రలు వేసేందుకు గుమికూడిన రైతులు

చౌడేపల్లె : మండలంలోని కొలింపల్లెలోని ఓ ఫర్టిలైజర్స్‌షాపులో ఒక్క యూరియా బస్తాకు ఎంఆర్పీ కంటే అధికంగా రూ.34 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం యూరియాకు డిమాండు ఉండడంతో ఫర్టిలైజర్స్ షాపు నిర్వాహకులు ఆసరాగా చేసుకొని రైతుల వద్ద అధిక సొమ్ములకు విక్రయిస్తున్నారు. వరిసాగు చేసిన రైతులు వారికి కేటాయించిన రైతుసేవా కేంద్రాల వద్దకు వెళ్లి తొలుత యూరియా కోసం టోకెన్లు తీసుకొని ఫర్టిలైజర్స్ షాపుల వద్దకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే చౌడేపల్లెలోని పుడమి ఫర్టిలైజర్స్ షాపులో ఒక బస్తా రూ.266 చొప్పున రైతులకు విక్రయిస్తుండగా కొలింపల్లెలోని ఓ ఫర్టిలైజర్స్ షాపులో రూ.300 చొప్పున విక్రయిస్తున్నారు. కనీసం ఎరువులు కొనుగోలుచేసిన రైతులకు బిల్లులు సైతం ఇక్కడ ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ఫర్టిలైజర్స్ షాపుల వద్ద యూరియా కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. మళ్లీ స్టాక్ ఎప్పుడు వస్తోందో తెలియక రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు షాపుల వద్ద పడిగాపులు గాస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అన్నిషాపుల్లో అవసరమైన స్టాకును కేటాయించి రైతులకు సక్రమంగా నిర్ణయించిన ధరలకే ఎరువులకే విక్రయించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మూడు నామాల దూడ జననం



చౌడేపల్లె : మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ యల్లంపల్లెకు చెందిన కోయ రవినాయుడుకు చెందిన ఆవు రెండు రోజుల కిందట తెల్లటి మూడు నామాలతో కూడిన దూడను ఈనింది. విషయం తెలిసిన చుట్టు పక్కల వారు దూడను చూసేందుకు తరలివస్తున్నారు. కాగా గతేడాది ఇదే ఆవుకు పుట్టిన దూడకు బొబ్బల రోగం రావడంతో రైతు రోగం నయమైతే టీటీడీకి విరాళంగా ఇస్తామని మొక్కుకోవడం, దూడకు జబ్బు నయం కావడంతో కుటుంబ సమేతంగా వెళ్లి గోశాలకు దూడను విరాళమిచ్చినట్లు తెలిపారు. మరోసారి అదే తమ ఇంటిలో మూడు తెల్లటి నామాలతో కూడిన దూడ పుట్టిందని రైతు చెబుతున్నాడు.